05ATP27_05ATP27.qxd 01-07-2023 PM 11:07 Page 1



# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పెద్దారెడ్డి

## - ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

**పుట్టపర్తి, జులై 01, ప్రభాతవార్త**

అలనాడు కమ్యునిష్టు ఉద్యమంలో పాల్గొని బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా లోచర్ల పెద్దారెడ్డి నిలిచారని పుట్టపర్తి శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కొనియాడారు. మాజీ నక్సలైట్ నేత కామ్రేడ్ పెద్దారెడ్డి 8వ వర్ధంతి కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించి పెద్దారెడ్డి అందించిన సేవలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దారెడ్డి కుమారుడు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రైతులకు వాతావరణ బీమా చెల్లించడంలో ప్రభుత్వం విఫలం

## - మాజీ మంత్రి పల్లె



పల్లె రఘునాథ్ రెడ్డి

**పుట్టపర్తిటౌన్, జులై 01, ప్రభాతవార్త**

జిల్లాలోని రైతులకు వాతావరణ ఆధారిత పంటలబీమా చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల్లో రైతులు వేరుశనగ పంట పెడితే కేవలం 14 మండలాలు మాత్రమే వాతావరణ ఆధారిత బీమాను వర్తింపజేసి, 18 మండలాలరైతులకు అన్యాయం చేశారన్నారు. జిల్లాలో మొత్తం 3 లక్షలకు పైగా రైతులు వేరుశనగ పంట వేస్తే కేవలం 80 వేల మంది రైతులకు మాత్రమే బీమా కల్పించారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు గాను ఒక్క నల్లమాడ మండలానికి మాత్రమే బీమా వర్తింపజేసి మిగతా 5 మండలాలకు ఎగనామం పెట్టారని మండిపడ్డారు. ఇక్కడ ఎమ్మెల్యేకానీ, జిల్లా ప్రతినిధులు, మంత్రులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. 2019-20 యేడాదికి గాను ఉమ్మడి అంతపురం జిల్లాలో ఇవ్వాల్సిన దాదాపు 1260 కోట్లు ఇన్‌ఫుట్ సబ్సిడీని ఇప్పటికీ రైతులకు విడుదల చేయలేదన్నారు. రైతుభరోసా పేరుతో కేంద్రం నిధులు మాత్రమే ఇచ్చి రైతులను ఈ ప్రభుత్వం దగా చేస్తోందన్నారు. వైఎస్ఆర్ జలకళ, సబ్సిడీ డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు ఎక్కడా అమలు కాలేదన్నారు. నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడం లేదని, టిడిపి హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేసి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయపోతే ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని హెచ్చరించారు.

# జగనన్న సురక్ష సర్టిఫికెట్లు ప్రదానం



కుల, ఆదాయ ధృవీకరణ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

**కొత్తచెరువు, జులై 01, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన కొత్తచెరువు నందు పంచాయతీ కార్యాలయం ఆవరణంలోజగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ రామాంజినేయ రెడ్డి, ఎంపిడిఓ సిద్దారెడ్డి, సర్పంచ్ రాధలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ మేరకు ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు మంజూరు చేసిన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యుగంధర్, షాన్‌షేట్, వాల్మీకి శంకర, కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, టౌన్ కన్వీనర్ భాస్కర్, హౌసింగ్ ఎఇ రమణారెడ్డి, ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 108,104,102 ఉద్యోగులకు అవార్డులు ప్రదానం



అవార్డులు అందిస్తున్న డిఎంహెచ్ఓ ఎస్.వి.కృష్ణారెడ్డి

**శ్రీసత్యసాయిజిల్లా(వైద్యం), జులై 01, ప్రభాతవార్త**

అరవింద్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ సంస్థ ప్రభుత్వ సహకారంతో స్థాపించి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 108, 104,102 సిబ్బందికి డిఎంహెచ్ఓ ఎస్.వి.కృష్ణారెడ్డి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ మేరకు శనివారం డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం నందు జరిగిన వేడుకలలో ఈ అవార్డులను అందజేయడం జరిగింది. అరబిందో ఎఇఎంఎస్ ఎంప్లాయిస్ అద్భుత పనితీరును డిఎంఅండ్ హెచ్ఓ ఎస్.వి.కృష్ణారెడ్డి అభినందించి ఉత్సాహపరిచారు. పదిమందికా ఆదర్శంగా నిలిచేలా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో 108,104, 102 సిబ్బంది డిఎం శంకర్, ఓఇలు రామకృష్ణ, ఆదినారాయణ, జుబేర్, ఉద్యోగులు మోహన్ బాబు, సూర్యనారాయణ, బి.వి.రామాంజి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జనార్ధన్, అశోక్, చంద్రహాసన్, జాఫర్, ఫరీద్ అహ్మద్, బాలరాజు, ఇఎంటి కాంతారావు, మల్లేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బిల్లుల చెల్లింపుపై చేతులెత్తేయడం దారుణం

## - మండిపడ్డ సామకోటి ఆదినారాయణ



సామకోటి ఆదినారాయణ

**పుట్టపర్తిరూరల్, జులై 01, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి త్రాగునీటి పథకం నిర్వాహకులకు షాక్‌నిస్తూ వైకాపా ప్రభుత్వం బిల్లుల చెల్లింపుపై చేతులెత్తేయడం దారుణమని జిల్లా తెదేపా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మండిపడ్డారు. శనివారం స్థానిక సంస్థల నిధుల్లో నుండి వీటిని చెల్లించాలని అధికారులు ఆదేశిస్తూ ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న స్థానిక సంస్థలపై మరో పిడుగు వేసిందని, 20 కోట్ల బిల్లులకు నిధులు ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసిందని, ఇక నుండి ఈ నిధుల కోసం తమతో సంప్రదింపులు చేయొద్దని గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ ఈఎంసి కార్యాలయం, సత్యసాయి త్రాగునీటి విభాగం బోర్డు కార్యదర్శికి ఏలూరు కాకినాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇకు మంగళవారం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగుచూశాయన్నారు. ఖాతాలు ఖాళీ చేశాక స్థానిక సంస్థల్లో నిధులు ఎక్కడి నుండి వస్తాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక సంఘం నిధులు విద్యుత్ చార్జీలకు మళ్ళించాక గ్రామాల్లో చిన్నాచితక సమస్యలను పంచాయతీలు పరిష్కరించలేకపోతున్నాయన్నారు. ప్రభుత్వం తరఫున ఇక నుండి దమ్మిడి కేటాయించే అవకాశం లేదని వీటి నిర్వహణ స్థానిక సంస్థలే చూసుకోవాలని ఉన్నత స్థాయి సమావేశంలో ఆర్థిక శాఖ స్పష్టం చేసినందునరాబోయే రోజుల్లో ఈ వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గ్రహించి త్రాగునీటి పథకాలకు నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం



ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

**శ్రీసత్యసాయిజిల్లా(వైద్యం), జులై 01, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లాలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఐఎఫ్‌సి, స్మార్ట్‌టివి, బైజ్యూస్, ట్యాబుల వినియోగంపై జులై 1వ తేది శనివారం నుండి ఈ నెల 15వ తేదివరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పుట్టపర్తి మండల పరిధిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు శనివారం డిఇఓ రంగస్వామి ఈ శిక్షణా తరగతులను ప్రారంభించారు.

# సీనియర్ పాత్రికేయులకు అక్రిడేషన్ అవకాశం కల్పించండి

## - కలెక్టర్‌ను కోరిన మీడియా ప్రతినిధులు

**పుట్టపర్తిరూరల్, జులై 01, ప్రభాతవార్త**

ప్రస్తుతం ప్రభుత్వ నిబంధనల మేరకు నియోజకవర్గంకు రెండు అక్రిడేషన్లు మాత్రమే మంజూరు చేస్తుండడంతో శ్రీసత్యసాయి జాల్లా నందు వివిధ పత్రికల్లో పనిచేస్తున్న చాలా మంది సీనియర్ జర్నలిస్టులు అక్రిడేషన్‌కు దూరమయ్యే పరిస్థితి దాపురించిందని, సీనియర్ జర్నలిస్టులకు అక్రిడేషన్ సౌకర్యం కల్పించాలని శ్రీసత్యసాయిజిల్లా మీడియా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం వారు జిల్లా కలెక్టర్‌ను కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 10 నుండి 20 సంవత్సరాల అనుభవంను ధృవీకరిస్తూ సమాచార శాఖకు అందజేసిన ఎడలా ఫ్రీల్యాన్సర్ అక్రిడేషన్ మంజూరయ్యే అవకాశం ఉన్నందున ఈ మేరకు సీనియర్ జర్నలిస్టులకు అక్రిడేషన్ దక్కే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని వారుకోరారు. అలాగే వార, మాస పత్రికలకు సైతం తగినప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలు కూడా శ్రీసత్యసాయి జిల్లాలో అంతర్భాగంగా ఉన్నందున ఆ మండలాలను పరిగణలోకి తీసుకొని టివి ఛానల్స్‌కు సైతం ఒక అక్రిడేషన్ అదనంగా మంజూరు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయిజిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు పుల్లయ్య, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాసులు, బాబు, మురళీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఆటో బోల్తా...

## - ఓ యువకుడు మృతి, డ్రైవర్‌తో పాటు మరో ప్రయాణీకుడికి గాయాలు



ఆటో బోల్తా ఘటనలో మృతి చెందిన యువకుడు పి.శ్రీనివాసులు

**గుంతకల్లు, జూలై 01 ప్రభాతవార్త**

మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామం గుంతకల్లు - గుత్తి జాతీయ రహదారి ఫోర్‌వే రహదారిలో ప్రమాదవశాత్తు ఓ ఆటో బోల్తా పడటంతో పాతకొత్త చెరువు గ్రామంకు చెందిన ఓ 18యేళ్ల యువకుడు పి.శ్రీనివాసులు మృతి చెందగా ఆటో డ్రైవర్ మహేష్‌తోపాటు మరో ప్రయాణీకుడు గంగాదర్ గాయపడిన ప్రమాద సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబందించి క్షతగాత్రులు తెలిపిన వివరాల మేరకు... గుంతకల్లు నుండి పాతకొత్తచెరువు గ్రామంకు 10మంది ప్రయాణీకులతో ఆటో బయలుదేరిందన్నారు. కాగా తిమ్మాపురం గ్రామశివారులో ప్రయాణిస్తున్నతరుణంలో ఆటో ప్రమాదవశాత్తు స్టీరింగ్ మొరాయింపు కారణంగా బోల్తా కొట్టిందన్నారు. కాగా ఆటో డ్రైవర్ సీటు ప్రక్కన కూర్చున్న సదరు వ్యక్తులు గాయపడ్డారన్నారు. దీంతో 108కు సమాచారం అందించగా సదరు వాహనం ఇఎంటి షఫీ, పైలెట్ దేవదానం తదితర సిబ్బంది హుటాహుటిన ప్రమాద సంఘటనా స్థలంకు చేరుకుని క్షతగాత్రులను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ చికిత్సల నిర్వహణతోచేర్చారు. కాగా తీవ్రంగా గాయపడిన యువకుడు శ్రీనివాసులును వైద్యసిబ్బంది రెఫర్ చేయడంతో కర్నూలుకు ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించగా మార్గమధ్యంలోని గుత్తి పట్టణ సమీపంలో మృతి చెందినట్లు గుర్తించి గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి శవపరీక్షల నిమిత్తం తరలించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదుతో విచారణ చేపట్టారు.

# సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

## - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**మడకశిర టౌన్, జులై 1 ప్రభాతవార్త**

మడకశిర మండలంలోని మణురు, గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హాజరై ప్రసంగించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్నామన్నారు. ఇందులో 11 రకాల సర్వీసులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అందించే సేవలను అర్హులైన ప్రజలు తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల పరిధిలో జూన్ 24వ తేది నుంచి 30వ తేది వరకు నిర్వహించిన క్యాంపులో దరఖాస్తు చేసుకున్న వారికి మొబైల్ ఆధార్ సీడింగ్, వన్ బి, కుల, ఆదాయ ధృవీకరణ తదితర సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, మడకశిర ఎంపిడిఓ సోనీ భాయి, తహశీల్దార్లు, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# హొస్పేట రోడ్డు ప్రమాద ఘటనలో మరో ఇద్దరు మృతి

## - పదికి చేరిన మృతుల సంఖ్య - క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి



రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల్ని ఆస్పత్రిలో పరామర్శిస్తున్న విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్

**బళ్లారి, జూలై01, ప్రభాతవార్త ;**

హొస్పేట సమీపంలో వడ్డరహళ్లి వద్ద శుక్రవారంనాడు జరిగిన భీకర రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతిచెందిన ఘటన విధితమే. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురిలో మరో ఇద్దరు శనివారంనాడు మృతిచెందారు. విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి కారణం పోలీసు అధికారుల నుంచి సమాచారం పొందారు. అనంతరం బళ్లారిలోని ట్రామాకేర్ సెంటర్‌కు చేరుకొని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వద్దకు వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పరిహారం ప్రకటించారని చెప్పారు. హొస్పేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరికొందరు క్షతగాత్రుల్ని కూడా తాను పరామర్శించి వచ్చినట్లు తెలిపిన మంత్రి, గాయపడిన వారందరూ త్వరగా కోలుకుంటున్నట్లు తెలిపిన మంత్రి, ప్రమాదం జరిగిన స్థలాన్ని వీక్షించినట్లు, సదరు రోడ్డు ప్రాంతం ఇరుకుగా ఉన్నందువల్లే ప్రమాదం జరిగిందని చెప్పారు. బళ్లారి - హొస్పేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణదశలో ఉండగా, అక్కడక్కడ పనులు ఆగిపోవడం వల్ల ఇరుకైన రోడ్ల గుండా వాహనాల సంచారం జరుగుతున్నదని, కేంద్ర ప్రభుత్వపు నిధుల విడుదలలో జాప్యం జరిగినందువల్లే ఈ రహదారి నిర్మాణం కుంటుపడిందని చెప్పారు. నాలుగైదు సార్లు ఈ మార్గానికి సంబంధించి టెండర్లు పిలిచినా రోడ్డు అభివృద్ధికి కంపెనీలు ఆసక్తి చూపలేదని చెప్పారు. త్వరలో ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపిన మంత్రి, ప్రస్తుతం తీవ్రంగా గాయపడిన వారు ట్రామాకేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారని, మిగిలిన ఏడు మంది హొస్పేటలో చికిత్స పొందుతున్నారని, త్వరలో రోడ్డు అభివృద్ధికి సంబంధించి అధికారులతో చర్చించి తెలిపారు. మృతిచెందిన వారిలో ఆటో డ్రైవర్ ఉమేష్ కూడా ఉన్నారని, ఇటువంటి ఘటన జరగడం విషాధకరమన్నారు. ఈ సందర్భంలో హొస్పేట ఎమ్మెల్యే ఆర్.గవియప్ప, హగరిబొమ్మనహళ్లి మాజీ ఎమ్మెల్యే భీమానాయక్, జిల్లా సర్జన్ డా.బసారెడ్డి, ట్రామాకేర్ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, గాయపడిన వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యుత్ ధరల పెంపుతో రైస్ మిల్లుల మనుగడ కష్టమే

## - జిల్లా రైస్ మిల్లుల నాయకుల ఆందోళన



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న జిల్లా రైస్‌మిల్లుల సంఘం నాయకులు

**బళ్లారి, జూలై01, ప్రభాతవార్త ;**

కేఈఆర్‌సీ సిఫారసు చేసిన ప్రకారం విద్యుత్ ధరలు విపరీతంగా పెంచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లుల మనుగడకు ముప్పు తెచ్చిపెట్టిందని, విద్యుత్ ధరల పెంపు కారణంగా రైస్ మిల్లులు బంద్ చేసి కూలీ పనికిపోయే పరిస్థితి నెలకొన్నదని బళ్లారి జిల్లా రైస్‌మిల్లుల యజమానుల సంఘం తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేసింది. స్థానిక పత్రికాభవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో జిల్లా రైస్‌మిల్లుల యజమానుల సంఘం అధ్యక్షుడు ఎన్.జి.బసవరాజ్, సంఘం పదాధికారులు మాట్లాడుతూ వచ్చిన కరెంట్ బిల్లులు చూసి గుండెలు బాదుకునేంత బాధను కలిగించిందని, విద్యుత్ చార్జీల పెంపుతో రైస్ మిల్లులు నడపడం మా వల్ల కాదని, మంత్రివర్గం ఇటీవల తీసుకున్న నిర్ణయం ప్రకారం ఏపీఎంసీ చట్టం సవరణ రద్దు చేయడాన్ని ఉపసంహరించుకుని, రైతులు, రైతులపై ఆధారపడిన పరిశ్రమలను ప్రభుత్వం రక్షణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎస్‌పీ మద్దతు యోజన కింద సీఎంఆర్ హల్లింగ్ అంశాలపై ప్రస్తావించిన ఆయన, రైస్ మిల్లర్లకు ఇప్పటికే ఆర్థికభారం పెరిగిపోయిందని, దీంతో రైస్ మిల్లుల మనుగడ కష్టతరమయ్యిందని, పెంచిన విద్యుత్ ధరలను తగ్గించకపోతే తాము రైస్ మిల్లులు నడుపుకోలేమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో పండిస్తున్న వరిధాన్యంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రభుత్వమే వరిని ఎంఎస్‌పీ మద్దతు యోజన కింద అధికస్థాయిలో వరిని కొనుగోలు చేసి తమ రైస్ మిల్లుల్లోనే బియ్యం ఆడించాలని చెప్పారు. తద్వారా సదరు బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చౌకడిపోల ద్వారా రేషన్ బియ్యంగా పంపిణీ చేయవచ్చునని సూచించారు. ప్రభుత్వం ఈ దిశలో సీఎంఆర్ మిల్ పాయింట్ ప్రక్రియను త్వరితగతిన కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో జిల్లాలోని బళ్లారి, కంప్లీ, సిరుగుప్ప తాలూకాల నుంచి రైస్‌మిల్లుల యజమానులు, సంఘం పదాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీఎంసీ చట్టం రద్దు వద్దు

## - బళ్లారి కాటన్, జిన్నింగ్ ప్రెస్ యజమానుల డిమాండ్



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న కాటన్ జిన్నింగ్ మిల్లుల యజమానులు

**బళ్లారి, జూలై01, ప్రభాతవార్త ;**

రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న తీర్మానం ప్రకారం ఏపీఎంసీ చట్టాన్ని రద్దు చేసే ప్రభుత్వపు చర్యను జిల్లా కాటన్, జిన్నింగ్ ఫ్యాక్టరీల యజమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేసిన వారు రైతులు, చిన్న పరిశ్రమలుగా ఉన్న పత్తి, కాటన్ మిల్లుల యజమానులు వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. బళ్లారిలో పత్రికాభవన్‌లో శనివారంనాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన బళ్లారి జిల్లా కాటన్ మర్చంట్స్ సంఘం అధ్యక్షుడు డి.తిప్పేస్వామి తదితరులు రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఏపీఎంసీ చట్టాన్ని వెనుకటి మాదిరిగా ఉన్నట్లుగానే సవరణ తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారని, ఈ నిర్ణయంతో రైతులు, చిరు పరిశ్రమలు తీవ్రంగా నష్టం జరుగుతుందని చెప్పారు. రైతులకు పత్తి రవాణా ఖర్చు, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులు, దళారీ, సెస్, బట్టలు, పత్తి తూకం తగ్గడం తదితర ఖర్చులు అధికమవుతాయని చెప్పారు. పత్తి మిల్లులు సమర్థవంతంగా పనిచేయకుండా వాటిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న మిల్లుల యజమానులు మరింత ఇక్కట్లకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా కాటన్ మర్చంట్స్ ఏపీఎంసీ మార్కెట్‌కు సంబంధించి ఎటువంటి సౌలభ్యాల వినియోగం ఆవశ్యకత లేకపోవడం వల్ల కాటన్ మార్చంట్స్‌ను సదరు చట్టం పరిధి నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఈ విషయంపై చర్చకు తమను ఆహ్వానించి ఏపీఎంసీ చట్టం సవరణ ఉపసంహరణ విషయమై ప్రభుత్వం అభిప్రాయాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంలో సంఘం పదాధికారులు, పలువురు కాటన్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

# శ్రీ శనైశ్వరాలయంలో వైధికంగా అభిషేకాలు... మూలమంత్రహోమము...

**గుంతకల్లు, జూలై 01 ప్రభాతవార్త**

గుంతకల్లు పట్టణ పరిధిలోని కసాపురం రహదారిలో గల శ్రీ గురుదత్త దత్తాత్రేయ శ్రీ శనైశ్వరాలయంలో శనివారం శ్రీవారి మూలవరులకు విశేష అభిషేకాలతో పాటు మూలమంత్ర హోమము కార్యక్రమాలను ఆలయ అర్చక బృందం వైధికంగా చేపట్టారు. నవగ్రహములలో ఒకరైన శ్రీ శనైశ్వరులకు అతిప్రీతికరమైన త్రయోదశిని పురస్కరించుకుని శ్రీవారి మూలవరులకు పంచామృత అభిషేకాలు, తైలాభిషేకాల నిర్వహణతో పాటు శ్రీ శనైశ్వరుని మూలమంత్రములో హోమము తదితర విశేష పూజాకార్యక్రమాలను వైధికంగా చేపట్టారు. సదరు శ్రీవారి ప్రత్యేక పూజా కార్యక్రమాలకు వివిద ప్రాంతాలకు చెందిన భక్తాదులు విరివిగా పాల్గొని నేత్రానందకరంగా దర్శించుకుని తమతమ మ్రొక్కుబడుల చెల్లింపులతో శ్రీవారి కృపకు పాత్రులయ్యారు. తదుపరి ఆలయ అర్చక నిర్వాహకులు భక్తాదులకు శ్రీవారి ప్రసాదంను వితరణగా పంపిణీ చేశారు.

# వ్యవసాయ పనులకు ఉపాధిహామీ పనులను అనుసంధానం చేయండి

## - ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్ప యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నేతలు

**శింగనమల, జులై 1 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో ఉపాధి పనులకు వ్యవసాయం అనుసంధానం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్ప యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏపి రైతు సంఘం పిలుపు మేరకు ప్రచార జాతలో భాగంగా శింగనమల మండల కేంద్రంలో జీపు జాతను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా రైతాంగం ప్రతియేటా ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల వద్ద పెట్టుబడుల కోసం అప్పులు చేస్తున్నారని, కావు తెలంగాణ తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు ఎకరాల వరకు ప్రతి ఎకరాకు 20వేలు పెట్టుబడి కింద రైతుకు ఇవ్వాలని, ఎన్ని ఎకరాలు ఉన్నా ఎకరాకు 10వేలు సాగు సాయం కింద రైతులకు సాయం అందించాలన్నారు. అప్పుడే రైతులు పంట సాగు చేసేందుకు ముందుకు వస్తారని, లేకుంటే రైతులు సేద్యానికి దూరం అవుతారన్నారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా కరపత్రాలను పంచారు. శింగనమల, శివపురం, బండమీదపల్లి, చక్రాయుపేట, పోతురాజు కాలువ, నాయినిపల్లిక్రాస్, పెరవలి గ్రామల మీదుగా మొత్తం మండలం అంతా జీపుజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మధుయాదవ్, రైతు సంఘం మండల అధ్యక్షులు భయన్న, చంద్రశేఖర్, చేనేత కార్మిక సంఘం నేసే మధు, నారప్ప, రామసుబ్బారెడ్డి, తాతయ్య, విజయ్, శివ, కుళ్లాయిస్వామి, ఓబులేసు, నాగరాజు, వెంకటరాముడు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కుళ్లాయప్ప జన్మదిన వేడుకలు



కుళ్లాయప్పను శాలువాతో సత్కరిస్తున్న దండు శ్రీనివాసులు

**శింగనమల, జులై 1 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాసులు, శాలువాతో సత్కరించి పూల బొకేను అందించి కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దాసరి గంగాధర్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆదినారాయణ, బిసి సెల్ అధ్యక్షులు బెస్తనారాయణస్వామి, కాయల సురేష్ యాదవ్, రంగస్వామి, సతీష్‌రాయల్, జంగం శెట్టి నవీన్, తిప్పన్న, రంగాపురం శ్రీరాములు, శివరామకృష్ణ, పప్పూరు శీన, పుల్లయ్య, ప్రవీన్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

06ATP27_06ATP27.qxd 01-07-2023 PM 10:38 Page 1



# 1బిలు వస్తున్నాయి కానీ పాస్ పుస్తకాలు రావు

**- అందుకు ఎండార్స్‌మెంట్ ఇస్తాం - సబ్ కలెక్టర్ కార్తిక్**


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కార్తిక్

**అగళి, జులై 1 ప్రభాతవార్త** : వందలాది మందికి తమ భూములకు సంబంధించి 1బిలు వస్తున్నాయి కానీ అదే 1బిలను మ్యుటేషన్‌కు దరఖాస్తులు చేసుకుని 1బిలు వచ్చిన అనంతరం పట్టాదారు పాసు పుస్తకాలకు దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా పాస్ పుస్తకాలు రావడం లేదని ఈ విషయాలను ఎంపిపితోపాటు ప్రజలు సబ్ కలెక్టర్ కార్తిక్ దృష్టికి తీసుకెళ్లగా రుణాల కోసం 1బిలు ఉన్న రైతులు బ్యాంకులకు వెళ్తే వారి పాస్‌పుస్తకాలు అడుగుతున్నారని, పాస్‌పుస్తకాల కోసం నెలల తరబడి వేచిచూస్తున్నామని అయినా అవి రావడం లేదని తెలపగా సబ్ కలెక్టర్ కార్తిక్ స్పందించి 1బిలకు ఎండార్స్‌మెంట్ ఇస్తామని, రుణాలు తీసుకోవడానికి, రెన్యూవల్ చేసుకోవడానికి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

# సచివాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**అగళి, జులై 1 ప్రభాత వార్త** : కోడిపల్లి సచివాలయాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు తోపాటు సబ్‌కలెక్టర్ కార్తిక్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పని చేస్తున్న సిబ్బంది ప్రజలకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. రెండు లక్షల ఖాతాల గురించి ఎంపిపి రేణుకా కామరాజు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీరి వెంట ఎంపిడిఓ నరేంద్రకుమార్, తహశీల్దారు జమానుల్లా ఖాన్ ఉన్నారు.


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సబ్ కలెక్టర్

# రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి

**- కరపత్రాల పంపిణీలో రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురుగుంట మనోహర్**


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జులై 1 ప్రభాతవార్త** : రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ అనుబంధ రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురుగుంట మనోహర్ డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారానికి చేపట్టిన దశలవారి ఉద్యమంలో భాగంగా శనివారం ఆయన స్థానికనాయకులతో కలిసి కూడేరు మండల కేంద్రంలో కరపత్రాలను పంపిణీచేశారు. ఈసందర్బంగా ఆయనమాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో రైతాంగం ఇబ్బందులు పడుతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో రాష్ట్రంలోనూ ప్రతి రైతుకు ఎకరాకు 10వేల రూపాయలు పెట్టుబడి సాయం చేయాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే డబ్బుతో కలిపి రైతులకు ఇస్తున్న 13,500 రూపాయలు అరఎకరంలో పంటపెట్టుబడికికూడా సరిపోదన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతు 2.45 లక్షల రూపాయల రుణభారంలో ఉన్నారని రైతు ఆత్మహత్యల్లో దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్ 3వ స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే విషయమన్నారు. స్వామినాధన్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేయకపోవడంవల్లనే ఈ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రమణ, నారాయణమ్మ, మల్ల రాముడు, కాసీం, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అర్హతున్న వారందరికీ ప్రభుత్వ లబ్ది చేకూరాలన్నదే లక్ష్యం

**- జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీపీ, జెడ్పీటీసీ- ఆమిద్యాల, వై.రాంపురం గ్రామాల్లో ప్రత్యేక క్యాంపుల నిర్వహణ**


ఆమిద్యాలలో ప్రజలకు సర్టిఫికేట్లు అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి ఖుష్బు కొఠారి


వై.రాంపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ చందా చంద్రమ్మ

**ఉరవకొండ, జులై 1 ప్రభాతవార్త** : అర్హతున్న వారందరికీ ప్రభుత్వ లబ్ది చేకూరాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఖుష్బు కొఠారి, ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏ.సి. పార్వతమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, కమ్మ, కురుబ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు బి.తేజోనాథ్, కె.గోవిందు, పెన్నహోబిళం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని ఆమిద్యాల, వై.రాంపురం గ్రామ సచివాలయాలవద్ద ఎంపీడీఓ పి.చంద్రమౌళి. టి.గురుప్రసాద్ బృందాల ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహించి దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు 11రకాల సర్టిఫికేట్లను పంపిణీ చేసి ఆధార్ కార్డుల్లో సవరణలు చేశారు. ఈసందర్బంగా అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ దేశంలోఎక్కడా లేనివిధంగా ప్రతిఇంటికీవెళ్లి మరీ సమస్యలు ఏమైనా ఉంటేతెలుసుకొని పరిష్కారం చూపించేదిశగా చేస్తున్న కార్యక్రమమే జగనన్న సురక్ష కార్యక్రమం అన్నారు. ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధృవీకరణ పత్రాలు, లావాదేవీ మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, సీసీఆర్సీ కార్డులు, కొత్తరేషన్‌కార్డు, రేషన్‌కార్డు విభజన, తదితర 11రకాలసర్టిఫికేట్లు పొందవచ్చన్నారు. నెలరోజులపాటు కొనసాగేకార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కె.యం.బాషా, బాల వెంకటేశులు, వీఆర్‌ఓలు రాధ, అంజలి సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# కర్ణాటక మద్యం పట్టివేత



**రామగిరి, జులై 1 ప్రభాతవార్త** మండలంలోని రామగిరి సమీపంలో శనివారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుంటిమద్దికి చెందిన ఎరుకుల ఆది తన ద్విచక్ర వాహనంలో 144 మద్యం పాకెట్లు తీసుకెళ్తూ పట్టుపడ్డాడు. ఎస్ఐ జనార్ధన్‌నాయుడు కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేశారు.

స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం

# కన్నులపండువగా శ్రీవారి ప్రాకారోత్సవం

**- శ్రీ లక్ష్మినరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు**


శ్రీవారి ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జులై 1 ప్రభాతవార్త** : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం ఆషాఢ శుద్ధ త్రయోదశి శనివారం సాయంత్రం శ్రీవారి ప్రాకారోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చిన ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆయన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వైసీపీ ఉరవకొండ పట్టణ అధ్యక్షుడు బ్యాంక్ ఓబులేసు మృతి

**- నివాళులర్పించిన ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్**


మృతదేహంవద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, తదితరులు


అనారోగ్యంతో మృతి చెందిన వైసీపీ పట్టణ అధ్యక్షుడు సి.ఓబులేసు

**ఉరవకొండ, జులై 1 ప్రభాతవార్త** : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉరవకొండ పట్టణ అధ్యక్షుడు బ్యాంక్ ఓబులేసు (65) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొంత కాలంగా పేగు సంబంధ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అభ్యుదయ భావాలు కల్గిన సి.ఓబులేసు విద్యార్థి దశ నుంచే సమస్యలపై పోరాటాలు చేసి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మేనేజర్ తదితర స్థాయిలో పనిచేశారు. పదవీ విరమణ అనంతరం వై.ఎస్.జగన్ మీద అభిమానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన పనితీరుతో పార్టీ అదిష్టానం ఆయనకు వైసీపీ ఉరవకొండ పట్టణ అధ్యక్షుడి బాధ్యతలను అప్పగించగా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ దృశ్యాలు

**మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపిన నేతలు :** కాగా బ్యాంకు ఓబులేసు మరణవార్త తెలియగానే మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అనంతపురంలోని ఆయన చికిత్స పొందుతున్న ప్రైవేటు ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహం ఉరవకొండకు తీసుకురాగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఇతర రాజకీయ ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. సాయంత్రం ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి స్థానిక నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాలు కల్గిన ఓబులేసు యూనివర్సిటీలో విద్యారంగ సమస్యలపై జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని మంచి మనసున్న ఆత్మీయుడిని కోల్పోయామని కొనియాడారు. ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బోయ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# పంటల భీమాలో రైతులకు తీవ్ర అన్యాయం

**రామగిరి, జులై 1 ప్రభాతవార్త** : పంటల భీమాలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం రామగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు అన్యాయం జరుగుతోందని వారు ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో 2014లో రూ.9.88 కోట్లు, 2016లో రూ.14.32 కోట్లు మంజూరు చేశారన్నారు. అంతేకాకుండా 2018లో కూడా రూ.14.88 కోట్లు భీమా మంజూరైన వైసీపీ అధికారంలోకి రాగానే ఆ డబ్బులు అందించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 2021లో రూ.3.16 కోట్లు, ప్రస్తుతం రూ.5.76 కోట్లు మంజూరు చేశారు. ఇది అంతా కలిపిన టీడీపీ హయాంలో ఒక ఏడాదికి ఇచ్చిన మొత్తమే అని విమర్శించారు. మండలంలో 43,414 ఎకరాలు సాగు చేయగా కేవలం 6వేల ఎకరాలకు మాత్రమే భీమా ఇచ్చారని, 30వేల ఎకరాలు సాగు చేసిన వేరుశనగకు భీమా ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో చేత కాని దద్దమ్మగా ఎమ్మెల్యే ఉన్నారని, రైతులకు ఇంత అన్యాయం జరిగితే ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో మాజీ మంత్రిపరిటాల సునీత వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు జరిగిన పంట నష్టంపై పూర్తి వివరాలు సేకరించి భీమా మంజూరు చేయించారన్నారు. చిన్నచిన్న విషయానికి మండల వైసీపీ నాయకులు టీడీపీ నాయకులను విమర్శిస్తుంటారన్నారు. రైతులకు ఇంత అన్యాయం జరిగితే వైసీపీ నాయకులు ఏం చేస్తున్నారని మండి పడ్డారు. చీనీ సాగు తక్కువగా ఉంటే దానికి భీమా మంజూరు చేసి సీఎం జిల్లాలో రైతులకు ఉపయోగపడేలా చేశారన్నారు. అధికారులు పంటకోత ప్రయోగాలు, ఈ క్రాప్ బుకింగ్ ఎందుకు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి సెల్ జిల్లా అధ్యక్షులు రంగయ్య, మాజీ జడ్పిటిసి రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు పరందామయాదవ్, మాజీ సర్పంచు శ్రీనివాసులు, లింగా శ్రీధర్‌నాయుడు, అక్కులప్ప, విశ్వనాథ్, ఎస్ ఆంజినేయులు, వడ్డీసుబ్బు, ఎంపిటిసి శ్రీనివాసులు, ఇనాయతుల్లా, పేపర్‌శీన, గుర్రం శీన, మంగాపురం ముత్యాలు, మాదన్న, ఇటిక నల్లప్ప, మనోహర్, ఆనంద్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

# మేము ఎవరి పల్లకీ మోయలేదు....

**- ప్రజల పల్లకీ మోసేందుకు సిద్ధమవుతున్నాం**

**- పవన్ కళ్యాణ్‌ను విమర్శించనిదే నిద్రపట్టని వైసిపి నేతలు**


చిలకం మధుసూధనరెడ్డి

**ధర్మవరం టౌన్; జులై 1 ప్రభాతవార్త** : తాము ఎవరి పల్లకీ మోయలేదని.... మోయాల్సిన ఖర్మకూడా పట్టలేదని, కానీ ప్రజల పల్లకీ మోసేందుకు సంసిద్ధమవుతున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధనరెడ్డి అన్నారు. స్థానిక ఎంఎల్ఎ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పవన్ కళ్యాణ్‌పై చేసిన విమర్శలపట్ల చిలకం తీవ్రంగా స్పందించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ను విమర్శించనిదే వైసిపి నాయకులకు నిద్రపట్టలేదని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ సభలకు విశేషంగా జనం రావడాన్ని ఓర్వలేక సినీ హీరోయిన్ హనీరోజ్ సభపెట్టినా జనం వస్తారని ఎద్దేవాచేయడం కేతిరెడ్డిలోని ఆందోళనను బహిర్గతం చేస్తోందన్నారు. యూ-ట్యూబ్ స్టార్ అయిన కేతిరెడ్డి బహిరంగ సభ ఏర్పాటుచేస్తే ఎంతమోతాదులో జనం వస్తారో చూద్దామన్నారు. పవన్ కళ్యాణ్ ఒక పార్టీ అధ్యక్షుడని, జనాభిమానం ఉన్న పరిణతిచెందిన నాయకుడన్న విషయం మరవకూడదన్నారు. ఒక రాజకీయ పార్టీ సిద్ధాంతాలను మరొక పార్టీ నాయకుడు తప్పుపట్టడం సంస్కారం కాదన్నారు. రాష్ట్ర ప్రజలను దుష్టపాలననుండి కాపాడుకునేందుకు అధికారపక్షంతో యుద్ధం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతిపక్షాలను కలుపుకుని పోయే క్రమంలో వారితో కలిసిమెలిసి ఉండడం తప్పుకాదన్నారు. అంతమాత్రానికే పల్లకీలు మోస్తున్నారనడం ఆక్షేపణీయమన్నారు. ఇష్టమొచ్చినట్లు తప్పుడు విమర్శలు చేస్తే ఏస్థాయిలోనైనా మాట్లాడతామన్నారు. ధర్మవరంలో ప్రతిపక్ష పార్టీల నాయకుల అనైక్యతను వినియోగించుకుని ఎన్నికల్లో గెలిచిన విషయం నిజంకాదా అంటూ ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులతో లోపాయికారి ఒప్పదం కుదుర్చుకుని ఎంఎల్ఎగా రెండు సార్లు ఎన్నికైన విషయం ప్రజలకు తెలుసన్నారు. ఈ సారి అలాంటి పరిస్థితిలేదని, అన్నంతినే ఏ ప్రతిపక్ష నాయకుడూ కేతిరెడ్డికి సాయం చేయరని స్పష్టం చేశారు. ఓటమి భయంతోనే కేతిరెడ్డి మాట్లాడుతున్నారని, దీంతో పాటు ఈసారి టిక్కెట్టు కూడా దక్కేపరిస్థితి లేదన్న అభద్రతాభావంతో కుంగిపోతున్నారని ఆయన తెలిపారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి కేతిరెడ్డికి లేదన్నారు. ఇకనైనా నోటిదూల మానుకోకపోతే జరగాల్సింది జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

# పశు వైద్యాధికారులుగా డా.ఎటి ప్రియదర్శిని పదవీ బాధ్యతలు స్వీకరణ


పశువైద్యాధికారులు డా.ఎటి.ప్రియదర్శిని

**కనగానపల్లి, జులై 1 ప్రభాతవార్త** : తగరకుంట వెటరన్నరీ డిస్పెన్సరీ రెగ్యులర్‌గాను అలాగే ముత్తువకుంట్ల ఇన్‌చార్జ్ పశువైద్యులుగా డా.ఏటి ప్రియదర్శిని శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మె కడప జిల్లా మంటపంపల్లి వెటర్నరీ డిస్పెన్సరీలో డాక్టర్‌గా పని చేస్తూ ఇక్కడికి రావడం జరిగింది. ఇక్కడ మద్దెల చెరువు పశువైద్యులు డా.మన్మోహన్‌రెడ్డి ఇన్‌చార్జ్ పశువైద్యులుగా పని చేశారు. నూతన పదవి బాధ్యతలు చేపట్టిన డా.ప్రియదర్శిని మాట్లాడుతూ.. పాడి, పశువుల రైతులకు గొర్రెల కాపరులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# నారీశక్తి మహిళల మెగా రక్తదాన శిబిరానికి విశేషస్పందన



రక్తదానం చేస్తున్న మహిళలు ,మాట్లాడుతున్న శ్రీవిద్యారణ్యభారతీస్వామి

**గుంతకల్లు టౌన్, జులై 1 ప్రభాతవార్త** : ఆ నలుగురు సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు శనివారం నిర్వహించిన నారీశక్తి మహిళల మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మహిళలు 60 మందికిపైగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. శిబిరాన్ని శ్రీజగద్గురుశంకరాచార్య హంపి విరూపాక్షి విద్యారణ్య మహాసంస్థానం శ్రీవిద్యారణ్యభారతిస్వామి వారు పర్యవేక్షించారు. ఈ సందర్బంగా స్వామివారు మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేసే మేదస్సు లేదన్నారు. మనిషి ఎదగడానికి సమాజం అవసరమని ఎదిగిన తరువాత సమాజానికి అదే మనిషి అవసరం వుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అవసరం వుందన్నారు. ప్రస్తుతం ఎంత సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా మనిషి రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, మనిషికి మరోమనిషి రక్తంమాత్రమే ప్రత్యామ్నాయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, డిఎస్‌పి నరసింగప్ప, వైస్‌ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంజుల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే శిబిరానికి భారతీయ సాంస్కృతిక సేవాసమితి, లయన్, ఇన్నర్‌వీల్ క్లబ్, లెజెండ్ బ్లడ్ డొనేషన్, శివప్రియ ఫౌండేషన్, తదితర సేవా సంస్థలు తమవంతు సహకారం అందించాయి.

# పేద విద్యార్థికి పాఠ్యపుస్తకాల వితరణ


విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందచేస్తున్న దృశ్యం

**గుంతకల్లు టౌన్, జులై 1 ప్రభాతవార్త** : పట్టణంలోని బాబుజగ్జీవన్‌రామ్ కాలనీలో వుంటున్న దర్శన్ అనే విద్యార్థికి 4 వేల రూపాయల విలువ చేసే పాఠ్యపుస్తకాలను మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బిసి రాష్ట్ర నాయకులు ఆర్.రామ్మోహన్ వితరణ చేశారు. విద్యార్థి కార్మెల్‌జ్యోతి పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి చదువుకు తమవంతు సహకారం అందిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పవిత్ర పేర్కొన్నారు.

# టిసిల కోసం విద్యార్థుల అవస్తలు - ఎస్ఎఫ్ఐ



మట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**గుత్తి, జులై 1 ప్రభాతవార్త** : గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు టిసిలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ ఆరోపించారు. స్థానిక జిల్లా ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా వక్తలు మాట్లాడుతూ టిసిలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇతర పాఠశాలల్లో చేరేందుకు ఇబ్బ ందులు పడుతున్నారన్నారు. ప్రశ్నిస్తే జిల్లా కార్యాలయం నుండి టిసి బుక్కులు రాలేదని ఇవ్వలేకపోతున్నామని సమాధానం వినిపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టిసి బుక్కులు అందచేసి టిసిలు అందచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శివ, చిరంజీవి, గౌతం, రవి, తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో జగనన్న సురక్ష


సర్టిఫికెట్లు అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, జులై 1 ప్రభాతవార్త** : గుత్తి మున్సిపల్ పరిధిలో శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని 4వవార్డు సచివాలయం పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా 7,8,25 వార్డుల పరిధిలో దరఖాస్తు చేసుకున్న 651 మంది లబ్దిదారులకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్‌చైర్‌పర్సన్లు వరలక్ష్మి , పద్మలతరెడ్డి, కమీషనర్ శ్రీనివాసులు అందచేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాజకీయాలు, కులమతాలకు అతీతంగా లబ్దిదారులకు ఉచితంగా అందచేయడమే ఈ పథకం లక్ష్యమన్నారు. నవరత్నాలు పథకంలో భాగంగా సర్టిఫికెట్లు అందని వారికి సురక్ష పథకం ద్వారా ఈ నెలాఖరులోపు అందచేస్తామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మురళి, వెంకటరెడ్డి, షెక్షావలి, రామాంజినేయులు, తమీమ్, సురేఖ, కౌన్సిలర్ల వరదరాజులు, ఫారుక్, వైకాపా జిల్లా నాయకులు రాజ్‌కుమార్‌రెడ్డి, గురుప్రసాద్, షఫి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం


వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

**గుత్తి, జులై 1 ప్రభాతవార్త** : పట్టణంలో శనివారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలు అందించే వైద్యవృత్తి పవిత్రమైందన్నారు. అనంతరం వైద్యులు కృష్ణప్రసాద్, జయశ్రీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి కుళ్లాయిబాబు, రిటైర్డ్ ఎఎస్‌డబ్ల్యుఒ శామ్యూల్, రిటైర్డ్ ఆర్టీసి ఉద్యోగి భీమలింగ, అంబేద్కర్ భవన కమిటీ కోశాధికారి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి భద్రత కల్పించాలి

**గుత్తి, జులై 1 ప్రభాతవార్త** : పట్టణంలోని నాయిబ్రాహ్మణులకు ఉపాధి భద్రత కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మసాజ్ పార్లర్ పేరిట ఇతర కులాల వారిని స్థానికంగా నియమించి తమ ఉపాధి అవకాశాలకు గండికొడుతున్నారన్నారు. అధికారులు స్పందించి అలాంటి పార్లర్లకు అనుమతులు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. అనంతరం చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా సచివాలయం కన్వీనర్ రంగస్వామి, నాయిబ్రాహ్మణసంఘం నాయకులు శ్రీనివాసులు, రమేష్, అర్జున్, లక్ష్మిరంగడు, తదితరులు పాల్గొన్నారు.

# కరూర్ వైశ్యా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం


అన్నదానం చేస్తున్న దృశ్యం

**ధర్మవరం,జులై 01, ప్రభాతవార్త:** ధర్మవరం కరూర్ వైశ్య బ్యాంక్ వ్యవస్థాక దినోత్సవం సందర్భంగా బ్యాంకు సిబ్బంది శనివారం ధర్మవరం మండలం గొట్లూరు అనాథ అశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాధాకృష్ణమూర్తి మరియు సిబ్బంది శివ,మున్విర్, రాఘవేంద్ర, రాకేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం నాడు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**ధర్మవరం, జులై 01, ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించి, అర్హత గల వారందరికీ కూడా లబ్ది పొందేలా సేవలు చేయాలని ఎంపిడిఓ సౌజన్య కుమారి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ కునుతురు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ సత్యమయ్య అధ్యక్షతన జరిగిందని తెలిపారు. గత ఏడు రోజులుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అందరూ కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న 11 రకాల సర్వీసులను గూర్చి వివరించడం జరిగిందన్నారు. తదుపరి మండల ఉపాధ్యక్షులు పాటిల్ కృష్ణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి చాంద్ బాషా చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 750 సర్వీసులను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి మమతా దేవి, సూపరెంటెంట్ నబి రసూల్, పంచాయతీ కార్యదర్శి సువర్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

**అమరావురం, జులై 01, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యలయం నందు అమరాపురం 1,2 సచివాలయాల పరిధిలోని వాలంటీర్లు యరియు సచివాలయ సిబ్బందితో ఎంపీపీ ఈరన్న, జడ్పిడిసి స్వారక్క నరసింహామూర్తి, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, మండల సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అమరాపురం గ్రామ సంచాయతీ పరిధిలోని వాలంటీర్లు తమకు కేటాయించిన 50 ఇండ్ల వద్దకు వెళ్లి వివిధ సర్గిఫికెట్లకు సంబందించిన వివిరాలను నమోదు చేసుకోని జగనన్న సురక్ష పథకం ద్వారా పరిష్కరించడానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వారు సూచించారు. అదేవిధంగా శివరం, మద్దనకుంట సచివాలయాల్లో కూడా వాలంటీర్ల సమావేశాన్ని నిర్వహించారు. శివరం గ్రామం నందు సర్పంచ్ కిష్టన్న, గ్రామ కార్యదర్శి శర్మ, అమరాపురం కార్యదర్శి ఉషాలతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కంప చెట్లు తొలగించి విద్యుత్ సమస్య పరిష్కారం


జెసిపితో ముళ్ల కంపలను తొలగిస్తున్న దృశ్యం

**అవమరావురం, జులై 01, ప్రభాతవార్త:** మండల పరిధిలో బసవనపల్లి సబ్ స్టేషన్ క్రింద వచ్చే ఆరోణపల్లిగ్రామం నుండి కర్ణాటక బార్డర్ మాసేవ్ గ్రామం వరకు వేళ్లె రైతుల వ్యవసాయ బోర్లకు విద్యుత్ సమస్య తలెత్తడంతో 11కెవి విద్యుత్ లైన్ కింద ఉన్న దాదాపు నాలుగు కిలోమీటర్ల వరకు జెసిబి ద్వారా ముళ్ల కంపలను చెట్లను తొలగించి విద్యుత్ సమస్య పరిష్కరించినట్లు లైన్‌మెన్‌లు జయకుమార్, క్రాంతిలు తెలిపారు. అనేక సార్లు రైతులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో దాదాపు 25 ట్రాన్స్ పార్మర్‌లు కింద ఉన్న రైతుల బోర్లు సమస్యలను పరష్కరించి, విద్యుత్ సమస్య తలెత్తకుండా పరిష్కరించినట్లు లైన్‌మెన్‌లు తెలిపారు.

## సమాజంలో వైద్యవృత్తి ఎంతో పవిత్రమైంది

-వాసవిక్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్



డాక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, జూలై 1 ప్రభాతవార్త**

సమాజంలో వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని వాసవిక్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్ పేర్కొన్నారు. డాక్టర్స్‌డేను పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవారిశాలలో డాక్టర్లను శనివారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ వైద్యులు డాక్టర్ విష్ణుమూర్తితో పాటు ప్రముఖ పంటి డాక్టర్ మహమ్మద్‌అల్తాఫ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందచేశారు. ఈ సందర్భంగా వాసవిక్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. రోగులకు మానవతాదృక్పథంతో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులను దైవంతో సమానంగా చూస్తారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వైద్యసేవలు అందించిన ప్రభుత్వ వైద్యులు డాక్టర్ విష్ణుమూర్తితో పాటు డాక్టర్ మహమ్మద్‌అల్తాఫ్‌లకు సన్మానం చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్, వాసవిక్లబ్ ఇంటర్‌నేషనల్ కో ఆర్డినేటర్ సుబ్బరామయ్య, సెక్రటరీ చంద్రమౌళి, ట్రెజరర్ సుబ్బరత్నమయ్య, బండారు శివకుమార్, శ్యాంప్రసాద్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి



వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

**పుట్లూరు, జూలై 1 ప్రభాతవార్త**

గ్రామీణ ఉపాధి హామి పథకం కింద హార్టికల్చర్‌లో మొక్కల సంరక్షణ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో విడుదల చేయాలని బిజెపి నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 పంచాయతీల పరిధిలో చాలా మంది చిన్న సన్నకారు రైతులు అత్యధికంగా వున్నారని వారు గ్రామీణ ఉపాధి హామి పథకం కింద హార్టికల్చర్‌లో మొక్కలను తీసుకుని దాదాపు 200 ఎకరాల్లో నాటారన్నారు. వాటికి సంబంధించి కొన్ని నెలలుగా బిల్లులు మంజూరు కాలేదని రైతులు వాపోతున్నారన్నారు. కావునా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కుందూ శ్రీనివాసులురెడ్డి, ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు రాగేని రామాంజియాదవ్, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ఎం.సూర్య నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ వెంకటయ్య, ఎస్‌సి మోర్చా మండల అధ్యక్షులు రామ్మోహన్, మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన బండారు శ్రావణిశ్రీ

**పుట్లూరు, జూలై 1 ప్రభాతవార్త**



ఆర్థిక సాయం అందచేస్తున్న బండారు శ్రావణిశ్రీ

మండలంలోని మడుగుపల్లి గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీకి చెందిన చిన్న ఓబన్న సతీమణి లక్ష్మీదేవి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ శింగనమల నియోజక వర్గం ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ గ్రామానికి చేరుకుని లక్ష్మీదేవి భౌతికదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం



అర్జీదారునికి ఉచితంగా సర్టిఫికెట్ అందచేస్తున్న అధికారులు

**యల్లనూరు, జూలై 1 ప్రభాతవార్త**

మండలంలోని 85 నిట్టూరు గ్రామ సచివాలయం పరిధిలో, మేడికుర్తి, వేములపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించి శనివారం జగనన్న సురక్ష కార ్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జగనన్న సురక్షలో భాగంగా క్యాస్ట్ సర్టిఫికెట్లు 41, సర్వీసుల ఇన్‌కం సర్టిఫికెట్లు 36, ఆధార్ సర్వీస్ 17, న్యూ రైస్‌కార్డులు 4, పెన్షన్ 7, ఫ్యామిలీ మెంబర్స్ 4, మొత్తం 132 సర్వీసులు అర్జీదారులకు ఉచితంగా అధికారులు అందచేశారు. ఈ కార ్యక్రమంలో ఎంపిపి గంగాదేవి, తహశీల్దార్ సుమతి, ఎంపిడిఓ వీర్రాజు, ఇఓఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు శారద, ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, సిచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా వైద్యుల దినోత్సవం

**యాడికి, జూలై 1 ప్రభాతవార్త**



కార్యక్రమంలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల లో శనివారం లయన్స్‌క్లబ్, లియోక్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వైద్యులు దేవరాజును లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రవి కుమార్‌రెడ్డి పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వైద్యో నారాయణ హరి అనే నానుడిని ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ సభ్యులు గుర్తుకు చేస్తూ వైద్యులు దేవునితో సమానమని, దేవుడు ప్రాణం పోస్తే ఆ ప్రాణాలను వైద్యులు తమ వైద్యంతో కాపాడుతారని వక్తలు పేర్కొన్నారు. అలాంటి వైద్యులను సన్మానించడం మన అదృష్టమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు రవిప్రసాద్, జోన్‌చైర్మన్ రంజిత్‌కుమార్, సత్యనారాయణ, జయరామిరెడ్డి, ప్రసాద్, సూర్యనారాయణ, కోశాధికారి రామకృష్ణ, మురళి, దివాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంటకు పంటల బీమా ప్రకటించాలి

**పెద్దవడుగూరు, జూలై 1 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న సిపిఐ కార్యదర్శి వెంకటరాముడు యాదవ్

పెద్దవడుగూరు మండలం లో పత్తి పంటకు పంటల బీమా ప్రకటించాలని సిపిఐ కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల మొత్తం 95 శాతం పత్తి సాగుచేస్తున్న ఇతర పంటలో మిరప తదితర పంటలు వేయడం జరుగుతుందన్నారు. కానీ నిన్న ప్రకటించిన ఉచిత పంటల బీమా పరిహారంలో పెద్దవడుగూరు మండలానికి చాలా అన్యాయం జరిగిందన్నారు. ఖరీఫ్‌లో అకాల వర్షాల వల్ల నకిలీ విత్తనాల వల్ల చీడపీడలతో మండల వ్యాప్తంగా పత్తి పంట నాశనమైందన్నారు. కానీ కేవలం ఒక గ్రామంలో కొంత మంది రైతులకు మాత్రమే రావడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటికైనా స్పందించి ఖచ్చితంగా పత్తి పంట ఎవరు వేశారో వారందరికి పరిహారం అందచేయాలన్నారు. లేకుంటే సోమవారం వ్యవసాయ కార్యాలయాన్ని దిగ్భందం చేసి పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బి.నారాయణ, హుస్సేన్‌పీరా, సుధాకర్‌గౌడ్, ముత్యాల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## మహిళలను చైతన్యపరచండి : ఎస్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

**యాడికి, జూలై 1 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో శనివారం ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మండలంలోని గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర భ్ంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళలను చైతన్య పరచాలని, చట్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాలలోపు మైనర్ వివాహాల గురించి, మహిళల చట్టాల గురించి, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి, బంగారు గొలుసు దొంగతనాల గురించి గ్రామాల్లోని ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, సమస్యల గురించి వెంటనే మా దృష్టికి ఎప్పటికప్పుడు తేవాలని ఎస్ఐ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## పాముకాటుకు మహిళ మృతి

**ముదిగుబ్బ, జూలై 1 ప్రభాతవార్త**



మృతి చెందిన చింతమ్మ

మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన చింతమ్మ (60) అనే మహిళ పాముకాటుకు గురై మృతి చెందింది. వివరాలు ఇలా వున్నాయి. చింతమ్మ రోజు కూలి పనిచేస్తూ జీవనం సాగించేది. రోజు వారి పనుల నిమిత్తం శనివారం ఉదయం మెరపకాయలు కోయడానికి వెళ్లింది. అయితే మెరపకాయలు కోస్తుండగా పాము ఆమె కాలుపై కాటువేయడంతో ఆమె అక్కడికక్కడే తోటలోనే మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. చింతమ్మకు జీవనాధారం లేక 60 ఏళ్ల వయసులో కూడా కూలిపనికి వెళ్లేదని ఆమె మృతి ఆమె కుటుంబానికి తీరనిలోటని వారి బంధువులు పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## బిసి లక్ష గర్జన సభను జయప్రదం చేయండి

**అమడగూరు, జూలై 1 ప్రభాతవార్త**



కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లెల జయరామ్

త్వరలో జరిగే బిసి లక్ష గర్జన సభను జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షులు మల్లెల జయరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరిదేవి కళ్యాణ మండపం లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టపర్తిలో జరిగే బిసి లక్ష గర్జన సభను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని వడ్డెర్లు, బిసిలను కలిసి వారి అభిప్రాయాలను స్వీకరించి రాబోయే రోజుల్లో బిసిలకు కూడా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు కేటాయించాలని అధికారులకు తెలియచేసే విధంగా ఈ లక్ష గర్జన సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఇందులో భాగంగా ఎటువంటి రాజకీయ గ్రూపులు లేవని అందరూ రాష్ట్ర వ్యాప్తంగా కలిసి మన సమస్యలను మనం నెరవేర్చుకునే విధంగా ముందుకు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివానంద, మండల వడ్డెర్ల సంఘం అధ్యక్షులు కిష్టప్ప, మాజీ ఎంపిపి రామచంద్ర, సీనియర్ నాయకులు తిరుపాల్, శ్రీరాములు, అంగడి అమర, బొట్టు సుధాకర్, వల్లిపి రామచంద్ర, అంజి, శీనా, గంగులప్ప, ఆదెప్ప, రామప్ప, వెంకట్, నారాయణ, పూల శీన, తదితర బిసిలు పాల్గొన్నారు.

## 3న గురుపౌర్ణమి వేడుకలు

**తాడిపత్రిఅర్బన్, జూలై 1 ప్రభాతవార్త**

పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయం వద్ద పందిర్లు, భారీకేడ్లు, భోజనం కౌంటర్లు తదితర ఏర్పాట్లను చేశారు. వీటితో పాటు ఆలయాన్ని వివిధ రకాల విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకల్లో భాగంగా గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారికి పాలాభిషేకము, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, కాగడహారతి, పూర్ణాహుతి తదితర పూజా కార ్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా శ్రీసాయిసత్యవ్రతాలు నిర్వహించనున్నారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్య క్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు రాఘవ తెలియచేశారు.

## ప్రమోషన్లలో ఉన్నటువంటి అసంబద్ధాలను తొలగించాలి

**అనంతపురం న్యూటౌన్, జులై 1 ప్రభాతవార్త**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరుగుతున్న ప్రమోషన్లలో ఉన్నటువంటి అసంబద్దాలను తొలగించాలని యుటిఎఫ్ జిల్లా శాఖ వారు డిమాండ్ చేశారు. జిఆర్-2 ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల సీనియార్టి లిస్టు ప్రకటించక ముందే, ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుల వివరాలు ప్రకటించిన తర్వాతనే ఫైనల్ సీనియార్టి లిస్టు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాల సహాకులకు సంబంధించి అన్ని క్యాడర్ల వారీగా ఉపాధ్యాయులు వివరాలను, అడక్వషిని ప్రకటించిన తర్వాతనే ఫైనల్ సీనియారిటీ లిస్టును ప్రకటించాలన్నారు. జూన్ 2023లో బదిలీలతోపాటు ప్రమోషన్లలో వ్రాత పూర్వకంగా, ఫోన్ ద్వారా నోట్ విల్లింగ్ తీసుకున్న వారందరిని తొలగించిన తర్వాతనే అన్ని సీనియారిటీ ఫైనల్ లిస్టులను ప్రకటించాలని వారు కోరారు. అంశాలపై వెంటనే పరిష్కరించి, వ్రాత పూర్వక సమాధానం ఇవ్వాల్సిందిగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అనంతపురం జిల్లా శాఖ తరుపున కోరుతున్నట్లు రాష్ట్ర సెక్రెటరీ వి.వెంకటేశ్వరప్ప, గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రామాంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గోవిందరాజులు, శ్రీనివాసులు తదితరులు కోరారు.

## ఆగస్టు 26న పుట్టపర్తిలో వడ్డెర లక్షగర్జన

- పిలుపు నిచ్చిన వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లెల జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల జయరాం

**ఓబుళదేవరచెరువు, జూన్ 1, ప్రభాతవార్త**

రాష్ట్రంలో 40 లక్షల ఓటు బ్యాంకు కలిగిన వడ్డెర జాతికి చట్టసభల్లో ఇంత వరకూ ప్రవేశం కల్పించలేదని రాజ్యాధికారమే లక్ష్యంగా వడ్డెర్లను చైతన్య పరచేందుకు ఆగస్టు 26న పుట్టపర్తిలో లక్షగర్జన మహాసభ నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు మల్లెల జయరాం పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక వడ్డెర సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రంగయ్య, ఓపిసిసి నాయకులు పల్లపు జయచంద్రమోహన్, జిల్లా కార్యదర్శి రమణలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక శాతం వడ్డెర్లు ఉన్నారన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడడంతో ప్రధాన రాజకీయ పార్టీలు వడ్డెర్లను ఓటర్లుగానే పరిగణిస్తూ వారిని వాడుకున్నారన్నారు. ఈ వెనుకబాటుతనాన్ని నిర్మూలించేందుకు, వడ్డెర్లలో రాజకీయ చైతన్యం తీసుకవచ్చేందుకు మొట్టమొదటగా పుట్టపర్తి నియోజకవర్గంలో తాను పాదయాత్ర చేసి వడ్డెర్ల ఉనికిని చాటనన్నారు. ఎస్టీ జాబితాలో అర్హత సాధించేందుకు తామే స్వయంగా పోరాటం చేస్తామనా న్రారు. వడ్డెర జాతి ముద్దు బిడ్డలు ఆగస్టు 26న పుట్టపర్తిలో జరిగే వడ్డెర లక్షగర్జన సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలసి రావాలన్నారు. ఈ సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు ఆంజనేయులు, జె శంకర, ఉత్తప్ప, వెంకటరమణ, వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పల్లె

**ఓబుళదేవరచెరువు, జూన్ 1, ప్రభాతవార్త**



ఆర్థిక సాయం అందచేస్తున్న టిడిపి నాయకులు

మండలంలోని కొండకమర్ల పంచాయితీ పరిధిలోని నాయనాకోటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు శ్రీరాములు తల్లి అనారోగ్య కారణంగా శనివారం మృతి చెందారు. స్థానిక నాయ కులు జాకీర్ అహ్మద్, ఎస్సీ నాయకులు బడిసం రామాంజినేయులు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి విషయం తెలియచేశారు. తల్లి మృతి చెంది సోకసముద్రంలో ఉన్న శ్రీరాములు కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామరి ్శంచి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. అనంతరం నాయకులకు తన వంతు సాయంగా రూ 5 వేలు అందించాలని సూచించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు గొర్ల శంకర, బిసి సెల్ కార్యదర్శి ఇడగుట్టు ఆంజనేయులు, ఎస్సీ సెల్ గంగాద్రి, మైనార్టీ కార్యదర్శి గండికోట ఇర్షాద్, మాజీ డీలర్ చంద్రాయుడు, సురేష్, శ్రీరాములు తదితరులు ఆయనకు రూ 5 వేలు అందచేశారు.

## ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ జేఏసీ రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా డా.హెచ్.రామచంద్ర

**అనంతపురం న్యూటౌన్, జులై 1 ప్రభాతవార్త**



ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ జెఏసి రాష్ట్ర ముఖ్య సలహాదారునిగా డాక్టర్ హెచ్ రామచంద్రకి ఎన్నుకోవడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ జేఏసి వ్యవస్థాపక అధ్యక్షులు ఐఎంఎం మహబూబ్ బాషా తెలిపారు. ఆర్ఈఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ హెచ్ రామచంద్ర మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ బిసిలను రాజకీయంగా ఆర్థికంగా ఉద్యోగంగా అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలను అందర్నీ ఒక తాటిపై తీసుకొచ్చి వారి హక్కుల కోసం ఉద్యమాలు చేస్తాం. మరికొంత మంది నాయకులను ఈ జేఏసీలో చేరడానికి ఆసక్తి చూపుతూన్నరు. వారిని చేర్చుకుని మరింత బలోపేతం చేసి ఎస్సీ, ఎస్టీ బిసి, మైనార్టీలకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా ముందుండి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చేస్తాము అదే విధంగా సన్మాన సభలో మరికొంత మంది నాయకులను ఎన్నుకుంటాము. ఈ పదవి బాధ్యతలకు ఇచ్చినందుకు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ జేఏసి రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బిసి రమేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు

**అనంతపురం సిటీ, జులై 1 ప్రభాతవార్త**



గజమాలతో బిసి రమేష్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్, బిసి సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి రమేష్‌గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున వైసీపీ నేతలు, బిసి సంఘాల నాయకులు, సన్నిహితులు ఆయన నివాసానికి వచ్చి శుభాకాంక్షలను తెలియజేశారు. భారీ గజమాలలతోపాటు భారీ కేకులను ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. అన్నదాన కార్యక్రమాలతోపాటు వృద్ధాశ్రమాల్లో చీరల పంపిణీ, నిత్యావసర సరుకులు అందించడంతోపాటు రక్తదాన శిభిరాన్ని కూడా చేపట్టారు. పార్టీలకు అతీతంగా పలువురు నేతలు బిసి రమేష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పార్టీ నేతలు బిసి సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## మనము-మనగ్రంథాలయానికి హాజరైన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు మందపాటి శేషగిరి రావు

**అనంతపురం న్యూటౌన్, జులై 1 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన మనము-మన గ్రంథ్యాలయము కార్యక్రమానికి ఈ రోజు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు మందపాటి శేషగిరి రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్‌ఎం ఉమామోహన్‌రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొని గ్రంథాలయాన్ని శుభ్రపరిచారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మనం-మన గ్రంథాలయం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మొదటి శనివారం చేపట్టాలని సూచించారు. అనంతరం మహిళ, పిల్లల గ్రంథాలయాన్ని సందర్శించి గ్రంథ్యాలయములో నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో గ్రంథాలయంలోని విద్యార్థులతో ముచ్చటించి లోటుపాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నిన్న ఏర్పడ్డ ఉద్యోగ సంస్థ అధ్యక్షులకు, కార్యవర్గ సభ్యులకు అభినందన తెలియజేశ్రారు. చివరగా జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం తరపున సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ, అనంతపురంమాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, సంస్థ కార్యదర్శి రమా, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది రామాంజినమ్మ, మల్లి, బాలచంద్ర, ఉద్యోగ సంఘ నాయకులు, కమ్మన్న, హెచ్.శ్రీనివాసులు, రవికుమార్‌నాయుడు, ప్రతాప్‌రెడ్డి, రామాంజినేయులు, ఇంతియాజ్ అహ్మద్, బాషా, కావేరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అల్లుగుండు నందు జగనన్న సురక్ష



జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి

**నల్లచెరువు, జూలై 1, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ సచివాలయం నందు నల్లచెరువు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఐనుద్దీన్ ఆదేశాల మేరకు శనివారం జగన్న సురక్ష కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఎంపిడిఓ శకుంతల, తహసిల్దార్ రవికుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 సర్వీసులకు సంబంధించిన సర్టిఫికెట్స్ అర్హులైన ప్రతి లబ్దిదారునికి సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇచ్చిన ప్రతిదీ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ రుణపడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, గృహసారథుల కన్వీనర్ రాజప్ప, ఎమ్మెల్యే పి మాధురి, ఏఎన్‌యం షరీఫా, హెల్త్ అసిస్టెంట్‌లు నారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్‌గా డాక్టర్ సివి.మధన్‌కుమార్



ఏపి మెడికల్‌కౌన్సిల్ చైర్మన్లను సన్మానిస్తున్న డాక్టర్ మధన్‌కుమార్

**కదిరి, జులై 1 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యునిగా కదిరి పట్టణానికి చెందిన డా.సివి.మధన్‌కుమార్ రెండవ సారి నియమితులయ్యారు. ఈ మేరకు మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా.సాంబశివారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి మరోసారి మెడికల్ కౌన్సిల్ మెంబర్‌గా నియమించడం అర్హించ దగ్గ విషమన్నారు. తన ఎంపికకకు సహకరించి చైర్మన్ సాంబశివారెడ్డి, సిఎం పర్సనల్‌సెక్రెటరీ డా.హరికృష్ణలకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏపి మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా.సాంబశివారెడ్డిని ఘనంగా సత్కరించారు.

## పంటల భీమా పరిహారం విడుదల

- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి

**కదిరి, జులై 1 ప్రభాతవార్త**



గత ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయినటువంటి రైతులకు పంటల భీమా పరిహారం మంజూరైందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ 2022 సీజన్‌కు సంబంధించి 6,534 మంది రైతులకు 6,26,66,000 పరిహారం వచ్చిందన్నారు. వేరుశనగ, ఆరంజ్, రెడ్‌గ్రామ్, మొక్కజొన్న, రాగి, పంటలు వేసినష్టపోయిన రైతులకు పరిహారం విడుదలైందన్నారు. రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే 3వ తేదిలోగా తెలపాలన్నారు.

## మృతి చెందిన పశువులకు భీమా చెల్లించాలి

**ఓబుళదేవరచెరువు, జూన్ 1, ప్రభాతవార్త**



వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

మృతి చెందిన పశువులకు భీమా చెల్లించి పాడిరైతులను ఆదుకోవాలని బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. బిజెపి మండల అధ్యక్షుడు మేకల వెంకటరమణ, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రామచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు అశ్వర్థప్ప, రంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి హరిక్రిష్ణల ఆధ్వర్యంలో పశువుల ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కాక ప్రజలు పశువుల ద్వారా కుటుంబాల్ని పోషించుకుంటున్నారన్నారు. కాగా ఇటీవల ప్రాణాంతక వ్యాధులు సోకి జీవాలు మృతి చెందడంతో పశుపోషకులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మృతి చెందిన పశువులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, నాగార్జున, సోషల్ మీడియా కన్వీనర్ నటరాజ్, వెంకటలక్ష్మి, వెంకటేష్ పాల్గొన్నారు.

## వశిష్ట పాఠశాలలో ఘనంగా డాక్టర్స్‌డే

**ఓబుళదేవరచెరువు, జూన్ 1, ప్రభాతవార్త :**



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భానుప్రకాష్

మండల కేంద్రంలోని వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరసా ్పండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భానుప్రకాష్ మాట్లాడుతూ ప్రతి యేటా జూన్ 1వ తేదీన డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతిని డాక్టర్స్ డే జరుపుకుంటున్నామన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యుడు పునర్జన్మనిస్తాడన్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా తమ జీవితాన్ని అంకితం చేసేవాడే వైద్యుడు అన్నారు. అందుకే వైద్యో నారాయణో హరి అంటుంటారని కనిపించని దైవాన్ని పూజిస్తే కనిపించే దైవంగా డాక్టర్‌ను భావిస్తారన్నారు. కనుక ప్రతి ఒక్క విద్యార్థి వైద్యవృత్తిని స్వీకరించి ప్రజాసేవలో పాలుపంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**తనకల్లు, జూలై 1, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని తవళం పంచాయతీ గందోడివారిపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలోని దుస్తూలు, ఫర్నిచర్, ఫ్రిడ్జ్, ఆహార దాన్యాలు పూర్తిగా కాలిపోయాయి. బాధితుడు తిరుపతయ్య ఆధార్‌కార్డు అప్డేట్ కోసం ఇంటిలో నుండి సచివాలయం వద్దకు వెళ్ళిన సమయంలో షార్ట్ సరూ ్క్యట్ కాగా గ్రామంలోని యువకులు తక్షణం స్పందించి నీరు చల్లి మంటలను అదుపు లోకి తెచ్చారు. ఈలోగా ఇంటిలో ఉన్న వస్తువులు మొత్తం కాలి బూడిదయ్యి సుమారు రూ. 10లక్షల దాకా నష్టం వాటిల్లిందని, తక్షణం ప్రభుత్వం స్పందించి బాధితుడు తిరుపతయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు తెలిపారు.



ఇంటిలో వస్తువులు పూర్తిగా కాలిపోయి బుడిదయ్యిన దృశ్యం

